# భయం గుప్పెట్లో విధులు

- కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇరిగేషన్ భవనం
- ఇదీ గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయ దుస్థితి
- పట్టించుకోని సంబంధిత అధికారులు, పాలకులు



గుండుగొలనులో లోతట్టులో ఉండి శిథిలావస్థకు చేరిన జలవనరుల శాఖ కార్యాలయం

**భీమడోలు:** రైతులకు అండగా ఉంటూ సాగునీటి అవసరాలను తీర్చే ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం (జలవనరుల శాఖ) కూలేందుకు సిద్ధంగా ఉంది. శ్లాబ్‌లు పెచ్చులూడడం, బీటలు వారిన, చెమ్మగిల్లిన గోడల నడుమ బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇరిగేషన్ ఉన్నతాధికారులు, కూటమి పాలకులు పట్టించుకోకపోవడం వలన భవనం శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతుంది. వర్షాకాలం కావడంతో శ్లాబ్‌ల నుంచి పెచ్చులూడి ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. దీంతో మరింత శిథిలావస్థకు చేరి, ఉద్యోగుల పాలిట ప్రాణ సంకటంగా మారింది. గత దశాబ్ద కాలంగా ఈ భవనం శిథిలావస్థకు చేరగా, ప్రస్తుతం మరింత బలహీనమవ్వడంతో వారి భద్రతపై ఆందోళన చెందుతున్నారు. గుండుగొలను సెక్షన్ కార్యాలయం పరిధిలోని భీమడోలు, దెందులూరు, ఉంగుటూరు, ఏలూరు రూరల్ మండలాల్లో పరిధిలోని 35 వేల ఎకరాల వరి సాగు, ఆక్వా సాగుతో పాటు గ్రామాల్లోని మంచినీటి చెరువులకు అవసరమైన నీటిని అందించేందుకు ఇక్కడి నుంచే ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఈయనతో పాటు ఇరిగేషన్ గుమాస్తాలు, లస్కర్లు కార్యాలయంలో ఉండి రాత్రి, పగలు పహారా కాస్తూ సాగు నీటిని అందించి రైతన్నలకు బాసటగా నిలిస్తున్నారు.



శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి



కార్యాలయంలో స్లాబ్ పెచ్చులూడి ఇనుప ఊచలు కనిపిస్తున్న దృశ్యం

**బ్రిటిష్ కాలం నాటి ఇరిగేషన్ కార్యాలయం**

గోదావరి కాలువ ద్వారా రైతులు, ఆక్వా, మంచినీటి చెరువులకు నీరందించేందుకు బ్రిటిష్ హయాంలో గుండుగొలను వద్ద ఇరిగేషన్ కార్యాలయాన్ని నిర్మించారు. ఈ కార్యాలయంలో ఏఈతో పాటు ఇద్దరు ఇరిగేషన్ గుమస్తాలు, 20 మంది లస్కర్లు విధులు నిర్వహిస్తారు. ఏఈ క్వార్టర్ కూడా ఉంది. ఇప్పుడు ఈ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో సార్వా, దాళ్వా సీజన్లలో రాత్రి, పగలు తేడా లేకుండా వారు విధులు నిర్వహిస్తూ రైతులకు సాగు నీటిని సరఫరా చేస్తున్నారు. దాళ్వాలో వారంతా రాత్రి వేళల్లో ఇక్కడ ఉండి పర్యవేక్షించాల్సి ఉండడంతో భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో వరి విస్తీర్ణం 22 వేలు, ఆక్వా 13 వేల ఎకరాలకు నీరందించాలి. వారి కోసం శ్రమించే తరుణంలో రాత్రి వేళల్లో అక్కడే నిద్రపోతుంటారు. దీంతో కంటిపై కునుకు పడని పరిస్థితి నెలకొందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా పట్టించుకున్నా నాధుడే లేడు. కనీసం ప్రత్యామ్నాయ భవనంలోకి మార్చాలని రైతులు, ఉద్యోగులు కోరుతున్నారు.

### కూటమిలో అభివృద్ధి పనుల జాడేది?

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి కానరావడం లేదు. వేలాది మంది రైతులకు ఉపయోగపడే ఇరిగేషన్ కార్యాలయాన్ని నిర్మించకపోవడంతో వారు విమర్శిస్తున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కూటమి నాయకులు పదవులు పొందారు. అయితే వారు ఈ శిథిలావస్థకు చేరిన భవనాన్ని నిర్మించేందుకు కనీస ప్రయత్నాలు చేయకపోవడంతో వారి పనితీరును బాహాటంగా విమర్శిస్తున్నారు. కార్యాలయం లోతట్టులో ఉండడంతో భారీ వర్షాల తరుణంలో నీరు చేరుతుంది. శ్లాబ్‌లో నుంచి నీరు పడడంతో తరుచూ సమావేశాలు నిర్వహించుకోవడం కష్టంగా ఉందని వాపోతున్నారు.

### శిథిలావస్థకు చేరింది



గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ భవనం కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరింది. ఉద్యోగులు, రైతులతో కలిసి సాగునీటి సంఘాల సమావేశాలు నిర్వహించాలంటే ఆందోళన కలిగిస్తుంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరుకాగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. నిధుల కోసం సాగునీటి సంఘాల ప్రతినిధులుగా తమ వంతు కృషిచేస్తున్నాం.

– గంధం లక్ష్మణ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, పూళ్ల

## క్లుప్తంగా

### వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

**దెందులూరు:** రేషన్ డీలర్లు 65 సంవత్సరాలు దాటిన లబ్ధిదారులకు సకాలంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు వృద్ధులకు ఇంటికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ షాపు వద్ద పరిసరాలు పరిశుభ్రంగా, ధరల పట్టిక, షాపు పనిచేసే వేళలు, అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ టి.నాగరాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

### వంతెన వద్ద స్తంభించిన ట్రాఫిక్

**ఉంగుటూరు:** నారాయణపురంలో పడిపోయిన వంతెన వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో వాలాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. పడిపోయిన వంతెనపై బాగున్న వైపు నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. తరువాత పోలీసులు క్లియర్ చేయడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది.

### మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



పాఠశాలలో సమస్యలను వివరిస్తున్న హెచ్ఎం, తదితరులు

**భీమడోలు:** పాఠశాలలో నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత హెచ్ఎంలదేనని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి, ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత, మురుగు డ్రైయిన్ ఏర్పాటు తక్షణమే చేపట్టాలని కమిటి సభ్యుడు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వై. మణికంఠ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం భీమడోలు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు హెచ్ఎం సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రత్తి మదన్, కాపాక సతీష్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు

**బుట్టాయగూడెం:** వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ అరెస్టులతో భయపెట్టలేరని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని అక్రమ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన స్థానిక విలేరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ క్రియాశీలక నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. నాని అరెస్ట్‌కు కారణం చెప్పకపోవడం చూస్తే అది ఎంత అక్రమమో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

### నాని అరెస్ట్ కక్ష పూరితం

**కామవరపుకోట:** ఏలూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని అరెస్ట్ కక్ష పూరితమైన చర్యని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కక్షపూరితమైన చర్యలకు పాల్పడుతూ అక్రమ అరెస్టులు చేస్తుందన్నారు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామికమన్నారు. అక్రమ అరెస్టులు ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

### నూకాలమ్మ దేవస్థానానికి విరాళం

**జంగారెడ్డిగూడెం:** నూకాలమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి శుక్రవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు విరివిగా సహకరిస్తున్నారన్నారు. స్థానిక సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, నర్మద దంపతులు రూ.25,116, బత్తిన సత్యనారాయణ (సత్తిపండు), ఉమామహేశ్వరి దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను వేదాశీర్వాదంతో అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటంతో సత్కరించారు. ఆలయ కమి టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నూకరాజు పాల్గొన్నారు.

### ముద్ద చర్మ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మందును పంపిణీ చేస్తున్న సర్పంచ్, పశు వైద్యాధికారిణి

**ఉంగుటూరు:** ఆవుల్లో ముద్ద చర్మ వ్యాధిపై పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష అన్నారు. శుక్రవారం ఉంగుటూరులో చర్మ వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించారు. టీకాలు కూడా వేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల్లో మచ్చలు, బొబ్బలు కాళ్లవాపు, మందంతో మచ్చలు, ఉంటాయని వివరించారు. పాల దిగుబడి తగ్గుతుందని, దీని నివారణకు టీకాలు వేయించాలని సూచించారు. పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలని వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులకు దూరంగా కట్టాలని తెలిపారు. దోమల నుంచి పశువులకు రక్షణ కల్పించాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, మదుబాబు, పశు సంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం

**ఉంగుటూరు:** రెండు రోజులుగా వర్షం విడవకుండా పడుతూనే ఉంది. గురువారం రాత్రి 4.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శుక్రవారం వర్షం చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో ఉంగుటూరుతో సహా గ్రామాల్లో రహదారులు ఛిద్రంగా మారాయి. నీరందక ఇబ్బందులు పడుతున్న మెరక భూముల రైతులకు వర్షం ఉపయోగపడింది. నాట్లు జోరందుకున్నాయి.

# దాతల సహకారం అభినందనీయం

**నిడమర్రు:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బువ్వనపల్లి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంకు శ్రీనివాసరావు(కాన్వెంట్ శ్రీను) రూ.5 వేల విలువైన నోట్ పుస్తకాలను అందజేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని, ఐదో తరగతి లోపు విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలను అందజేస్తున్నట్లు దాత శ్రీనివాసరావు తెలిపారు. నోట్ పుస్తకాలను హైస్కూలు హెచ్ఎం సంకు ఏసుబాబుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలారి సత్యవతి, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవి, ఎస్ఎంసీ చైర్మన్ తోపు నాగమణి, అలుమోలు అరుణ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



నిడమర్రు: హెచ్ఎంకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాత

**విద్యార్థులకు గుర్తింపు కార్డులు, డైరీలు**

**గణపవరం:** మండలంలోని ముప్పర్తిపాడు గ్రామంలోని రెండు పాఠశాలల విద్యార్థులకు రూ.15 వేల విరాళంతో గుర్తింపు కార్డులు, డైరీలను పంపిణీ చేశారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సత్తిజానకి, నాగ వెంకటరెడ్డి దంపతులు గ్రామంలోని యూపీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లోని 100 మంది విద్యార్థులకు డైరీలు, గుర్తింపు కార్డులు, స్టిక్కర్లను అందజేశారు.



గణపవరం: విద్యార్థులకు డైరీలు, గుర్తింపు కార్డులు అందజేస్తున్న దాతలు

# శేషాద్రి నగర్ అభివృద్ధిపై దృష్టి

**జంగారెడ్డిగూడెం:** శేషాద్రి నగర్‌ను అన్ని మౌలిక వసతులతో సదుపాయాలు కల్పించి తీర్చిదిద్దడానికి ప్రణాళికాయుతంగా ముందుకు వెళుతున్నట్లు 13వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు అన్నారు. 13వ వార్డులోని శేషాద్రి నగరలో శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికులతో కలిసి పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రరావు మాట్లాడుతూ శేషాద్రి నగర్‌లో గొట్టుముక్కల భాస్కరరాజు పక్కన ఉన్న రహదారులను రాళ్లు వేసి చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రూ.5 లక్షలు వెచ్చించి ఖాళీ మైదానాల్లో వరద నీరు పల్లపు ప్రాంతాలకు పోయే విధంగా కూడళ్ల మధ్యలో తూరలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.10 లక్షలు వెచ్చించి సీసీ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మి, కౌన్సిల్, కమిషనర్ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లి మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



వార్డు పరిస్థితులు తెలుసుకుంటున్న కౌన్సిలర్ చంద్రరావు

## కారుమూరి వాహనాన్ని అడ్డుకోవడం దారుణం



చిప్పాడ నరసింహారావు



గురజాల పార్థసారథి

**జంగారెడ్డిగూడెం:** తణుకులో హరిహర వీరముల్లు సినిమా రిలీజ్‌లో బైక్ ర్యాలీ పేరుతో బీసీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వాహనాన్ని జనసేన నాయకులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురజాల పార్థసారథి చెప్పారు. కారుమూరి నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యక్రమంలోకి చొరబడి, ప్రచార రథంపైకి ఎక్కి హల్‌చల్ చేయడం సరికాదన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

**కారుమూరి కాన్వాయ్‌ని అడ్డుకోవడం సరికాదు.** బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వెళుతున్న వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి, బీసీ నాయకులు కారుమూరి నాగేశ్వరావు కాన్వాయ్‌ని జనసేన కార్యకర్తలు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామని చింతలపూడి నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘు అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు అన్నారు. తణుకు పట్టణంలో పవన్ కళ్యాణ్ సినిమా రిలీజ్ ఊరేగింపులో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కారుమూరి వాహనంపైకి ఎక్కి హడావుడి చేయడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

**జంగారెడ్డిగూడెం:** జీలుగుమిల్లి విద్యుత్ ఉప కేంద్రంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) శుక్రవారం నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు తమ బిల్లులు, లో వోల్టేజీ సమస్యలను 1912కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. అక్కడ కూడా పరిష్కారం కాని సమస్యలను విశాఖపట్నంలోని తమ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చన్నారు. సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు మాట్లాడుతూ వినియోగదారులు ప్రభుత్వాలు అందించే సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్.మురళీకృష్ణ, ఎస్.సుబ్బారావు, ఏడీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అపరిశుభ్ర పరిసరాలే వ్యాధులకు మూలం



భీమడోలు: అవగాహన ర్యాలీ చేస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి గోవిందరావు



ఉంగుటూరు కుండీల్లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

**భీమడోలు:** అపరిశుభ్ర పరిసరాలే వ్యాధులకు మూలమని, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని భీమడోలులో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వఉండడం వలన దోమలు వ్యాప్తి చెంది ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయన్నారు. దోమల వలన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీటి కలుషితం వలన టైఫాయిడ్, అతిసారం, కామెర్లు వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం వస్తే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు మురళి, చందూ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ నికిత శ్రీ, కనకరత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**దోమల రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**ఉంగుటూరు:** దోమల రహిత సమాజం నిర్మించడానికి ప్రజలు సహకరించాలని ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్ర మం కైకరంలో నిర్వహించారు. అవగాహన సమా వేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. కుండీల్లో, టైర్లలో, కొబ్బరి బొండాల్లో నిల్వనీరును పారబోయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల వ్యాప్తిని అరికట్టొచ్చన్నారు. జయశ్రీ, వెంకటేశ్వర మ్మ, శైలజ, వెంకటలక్ష్మి, జయలక్ష్మి, విజయలక్ష్మి, రాధ, కనకదుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ధ్యానంతో ప్రశాంతత

**చింతలపూడి:** ధ్యానం వలన మనసు ప్రశాంతంగా ఉంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ శిష్యులు జగదీష్‌శాస్త్రి గురూజీ అన్నారు. చింతలపూడిలో లయన్స్ క్లబ్‌చే మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు.

# వైభవంగా శ్రావణ శుక్రవార పూజలు



జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



శాకంబరిగా కనకదుర్గమ్మ



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మకు హారతులిస్తున్న అర్చకుడు

**జంగారెడ్డిగూడెం:** ముత్యాలమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని అర్చకులు కాశీ పండిట్ బ్రహ్మశ్రీ ఆదిత్య మిత్ర బ్రహ్మత్వంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి లఘున్యాస పూర్వకంగా పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూల విరాట్‌కు 27 నక్షత్ర కుంభ సూర్య చంద్ర నక్షత్ర గజ వృషభ సింహ హారతులు ఇచ్చారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కె.ధర్మరాజు, బ్రహ్మం, చోడవరపు రంగ పాల్గొన్నారు.

**భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు**

**కొయ్యలగూడెం:** శ్రావణమాస ఆరంభం సందర్భంగా శుక్రవారం మండల వ్యాప్తంగా అమ్మవార్ల ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. నరసన్నపాలెం వై.జంక్షన్‌లో కొలువైన కనకదుర్గాంబిక అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. కన్నాపురం, కొయ్యలగూడెం, గవరవరం, బయ్యన్నగూడెం కనకదుర్గమ్మ ఆలయాల్లో కుంకుమార్చన పూజలు చేశారు. గ్రామ దేవతల ఆలయాల వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

**క్షేత్ర దేవతకు కుంకుమ పూజలు**

**ద్వారకాతిరుమల:** శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ముందుగా ఆలయాన్ని దేవస్థానం సిబ్బంది సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత కుంకుళ్లమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ చండీ హోమాన్ని జరిపారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# అధ్వాన రహదారితో ఇక్కట్లు



గుంతలతో అధ్వానంగా మారిన రహదారి



ప్రమాదాలకు కారణం అవుతున్న మార్జిన్

**కొయ్యలగూడెం:** అధ్వాన రహదారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ ప్రధాన రహదారి 216(డి) కొయ్యలగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఏఎంసీ యార్డ్ సమీపంలో భారీ గుంతలు పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గుంతల్లో పడి ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతుండగా భారీ వాహనాలు అదుపుతప్పి రోడ్డు మార్గం వైపుకు లేదా ఎదురుగా వస్తున్న వాహనాల మీదకు దూసుకుపోతున్నాయని అంటున్నారు. ఆరు నెలల వ్యవధిలో ఈ ప్రాంతంలో రెండు సార్లు నేషనల్ హైవే అధికారులు మరమ్మతులు చేపట్టినప్పటికీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వలన రోడ్డు అధ్వానంగా మారిందని ఆరోపించారు. అదే విధంగా కొయ్యలగూడెం చెక్ పోస్ట్ సెంటర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా రోడ్డు లోపలకు కుంగిపోవడంతో కంటికి కనపడని విధంగా రోడ్డు మార్జిన్ ఏర్పడిందని దీని వలన వాహనాల వీల్స్ స్లిప్ అవుతున్నాయన్నారు. తరచూ వాహనాలు ఎక్కువగా ఇటీవల ప్రమాదాలకు గురి కావడంతో మహిళలు బైకుల నుంచి అదుపుతప్పి పడిపోతున్నారని స్థానిక దుకాణదారులు పేర్కొంటున్నారు. ఒక్కో సారి డివైడర్‌ను ఢీకొని ప్రాణాలను సైతం కోల్పోతున్నారని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఏఎంసీ యార్డ్, హెచ్‌డీఎఫ్‌సీ ఎదుట ఉన్న ప్రమాదకర రోడ్డును అభివృద్ధి చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.